సాక్షి సిద్దిపేట

శనివారం | 18 | మార్చి | 2023

I



ఫాంల్యాండ్ దందా

నర్సాపూర్ మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో ఫాంల్యాండ్ పేరిట రియల్ దందాకు తెరలేపారు. అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ||లో..



పాముల విక్రయ ముఠా అరెస్ట్

రామచంద్రాపురం పరిధిలో రెండు తలల పాములను విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ||లో..



అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి భాగస్వామ్యంతో సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని రూరల్ ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్ అన్నారు. |||లో..

న్యూస్‌రీల్

దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

మర్కూక్(గజ్వేల్): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాములపర్తి గ్రామంలో కొనసాగుతున్న వీరహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. దీంతో పల్లెలకు ఆధ్యాత్మిక కళ వస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీనివాస్‌కు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలరెడ్డి, నాచారం ఆలయం చైర్మన్ హరిపంతులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటేష్, భిక్షపతి, కిరణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గేవరకు మార్కెట్‌కు పంట తేవొద్దు



విజితా వేణుగోపాల్‌రెడ్డి

సిద్దిపేటజోన్: మూడు రోజుల పాటు వర్షాలు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం వరకు మార్కెట్‌కు పొద్దుతిరుగుడు రైతులు పంటను తీసుకరావొద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ విజితావేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో జిల్లాలో మొట్టమొదటి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి రైతు పంటను కొనుగోలు చేస్తామని ఆమె పేర్కొన్నారు. కురుస్తున్న వర్షాల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యార్డులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రైతులు సహకరించాలని వర్షాలు తగ్గిన తర్వాత పంట తేవాలని కోరారు.

రేపు మల్లన్న చివరి వారం

ముగియనున్న బ్రహ్మోత్సవాలు



స్వామి వారి మూల విరాట్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు రేపటితో ముగియనున్నాయి. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం మొదలుకొని ఉగాదికి ముందు వచ్చే ఆదివారం రాత్రి అగ్నిగుండాల కార్యక్రమంతో ముగుస్తాయి. రేపటి ఆదివారం ముగింపు వారానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు అగ్నిగుండాల కార్యక్రమం ప్రారంభించి సోమవారం ఉదయం ఐదు గంటలకు అగ్నిగుండాలు తొక్కుతారు. సుమారు మూడు నెలల పాటు కొనసాగిన ఈ జాతర ఈ అగ్నిగుండాల కార్యాక్రమంతో ముగుస్తుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బాలల కథల పోటీల ఫలితాలు విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సుగుణ సాహితి సమితి సిద్దిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉగాది బాలల కథల పోటీలు–2023 ఫలితాలను సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య శుక్రవారం సిద్దిపేటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 217 కథలు రాగా కథల పోటీకి న్యాయనిర్ణేతగా ప్రముఖ బాలసాహిత్యవేత్త, పరిశోధకులు డాక్టర్ వాసరవేణి పరుశరాములు 20 మందిని విజేతలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడ్గ చెన్నకృష్ణారెడ్డి సౌజన్యంతో మార్చి నెలాఖరులో నిర్వహించనున్న సమావేశంలో విజేతలైన బాల కథకులకు బహుమతుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు!

రోడ్ల మరమ్మతులకు రూ.183 కోట్ల నిధులు

- 274 పనులను 25 ప్యాకేజీలుగా విభజన
- నాలుగు ప్యాకేజీల టెండర్లను పట్టించుకోని వైనం
- ముచ్చటగా మూడుసార్లు అదే పరిస్థితి
- నాలుగోసారి మళ్లీ పిలిచిన పీఆర్ అధికారులు



గుంతలమయంగా లద్నూరు- మరుమాముల రోడ్డు

సాక్షి, సిద్దిపేట: పల్లెల్లో గుంతల రోడ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మరమ్మతులకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్ల మరమ్మతుకు రూ.183 కోట్ల నిధులను మంజూరు చేసింది. మొత్తం 274 వర్క్‌లను 25 ప్యాకేజీలుగా విభజించారు. వీటి కోసం రెండు నెలల క్రితం టెండర్లు పిలవగా వీటిలో నాలుగు ప్యాకేజీలకు సంబంధించిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. అనంతరం మరో రెండు సార్లు పిలిచారు అయినా అదే పరిస్థితి. దీంతో ఇప్పుడు మరోసారి టెండర్లు పిలిచారు. ఈసారైనా పనులు ప్రారంభమవుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

16 రోడ్లు.. రూ.8.75 కోట్లు

- ఇప్పటివరకు మూడుసార్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఈ నెల 18న నాలుగోసారి టెండర్లు పిలిచారు. ఈ నెల 27వ తేదీ వరకు టెండర్లు స్వీకరించనున్నారు.
- డబ్బులు ఆలస్యంగా వస్తాయని అనుమానంతో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈసారి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి రోడ్లు మరమ్మతులు చేసేలా అధికారులు కృషి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.
- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు విభజించిన నాలుగు ప్యాకేజీల్లో మూడు ప్యాకేజీలు చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దుల్మిట్ట మండలాలకు చెందిన రోడ్లు ఉండగా మరొక దాంట్లో దుబ్బాక నియోజకవర్గానికి చెందిన రోడ్లు ఉన్నాయి.

రోడ్ల వారీగా నిధులు ఇలా..


- ఈ నాలుగు ప్యాకేజీల్లో 16 రోడ్లు ఉండగా వాటికి రూ.8.75 కోట్ల నిధులు కేటాయించారు. ఆకునూరు నుంచి రాంపూర్ రోడ్డు మరమ్మతులకు రూ.38 లక్షలు, చిట్యాల- దానంపల్లికి రూ.38 లక్షలు, ముస్త్యాల నుంచి వీరన్నపేటకు రూ. 24 లక్షలు, చేర్యాల – నర్సపల్లి రోడ్డుకు రూ.14.9 లక్షలు, లద్నూరు నుంచి మరుముల వరకు రూ.62 లక్షలు, ఆకునూరు – కొత్త దొమ్మాటకు రూ.81.9 లక్షలు, గురువన్నపేట – పోసాన్‌పల్లికి రూ.63 లక్షలు, కొమురవెల్లి – రాంసాగర్‌కు రూ.1.09 కోట్లు, మద్దూరు – వల్లంపట్లకు రూ.1.96 కోట్లు, చిట్యాల ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి తాడురు వరకు రూ.55 లక్షలు, కిష్టంపేట – రాంసాగర్‌కు రూ.17.7 లక్షలు, కుటిగల్ – బెక్కల్ రూ.15.6 లక్షలు, బీ కొండాపూర్ – గువ్వలవేనికు రూ.45 లక్షలు, ధర్మాజీపేట ఎక్స్ రోడ్డు – రామక్కపేట రూ. 20 లక్షలు, వీరారెడ్డిపల్లి – దౌల్తాబాద్‌కు రూ.50 లక్షలు, గొల్లపల్లి – ఇందుప్రియాల్‌కు రూ.45 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

త్వరగా పూర్తి చేస్తాం



నాలుగు ప్యాకేజీలకు సంబంధించిన రోడ్ల మరమ్మతులు చేసేందుకు ఈసారి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఈ నెల 24వ తేదీ వరకు టెండర్ల స్వీకరణ ఉంటుంది. ఈ రోడ్లన్నీ మే 31వ తేదీ వరకు పూర్తి చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– శ్రీనివాసరావు, ఈఈ, పీఆర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం చేరుకోవాలి

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఈ ఏడాది తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులందరూ కలిసి పనిచేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పామాయిల్ సాగుపై వ్యవసాయ, ఉద్యాన, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సాగులో ఇప్పటికే సాధించిన పురోగతిపై అధికారులను అభినందించారు. అదే ఉత్సాహంతో ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. రైతుల వద్దకి వెళ్లి ఈ సాగుపై అవగాహన కల్పించాలన్నారు. మార్చి 31 లోపు విధిగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏఓ, ఏడీఏ, ఏఈఓలు పర్యటించి ఎంచుకున్న వ్యవసాయ క్షేత్రాన్ని డీడీ పేమెంట్ కాగానే భూమిని చదును చేసి ఫిట్‌మెంట్ మార్కింగ్, ట్రెంచింగ్ చేయించాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేందుకు ఆయిల్‌ఫెడ్ అధికారులు ప్రతి మండలానికి ఒకరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకరరెడ్డికి తెలిపారు. డ్రిప్ కంపెనీలు పని పూర్తి చేశాక సమస్యలు వస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు తరచుగా కలుస్తుండాలన్నారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(ఎర్రవల్లి)లో చేనేత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఏనాడు కూడా చేనేతల సంక్షేమాన్ని పట్టించుకోలేదని వాపోయారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత చేనేతల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎర్రవల్లి సర్పంచ్ ఆకారం బాలమణిరాములు, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, పద్మశాలి సంఘం నాయకులు నాగేష్, నరేష్, నాయకులు హైమద్ పాల్గొన్నారు.

రుతుప్రేమపై చైతన్యం అవసరం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రానికి వినూత్నంగా చెప్పుకునే రుతుప్రేమపై మరింత చైతన్యం, అవగాహన అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చంద్లాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీపీఓ దేవకీదేవితో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల నెలసరి సమయంలో ఇబ్బందులు, ఆరోగ్య సమాజం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, ఆరోగ్యం కాపాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షిద్దామన్నారు. శానిటరీ ప్యాడ్స్‌కు బదులుగా పర్యావరణహితమైన శానిటరీ కప్పులను ఉపయోగించాలన్నారు. రుతుచక్రం మానవ సృష్టికి మూలమని, రుతచక్రం లేకపోతే మానవ జీవన విధానం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరోజన, డాక్టర్ శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండం వనిత, సర్పంచ్‌లు చంద్రకళ రవి, నవీన్ కుమార్, ఎంపీటీసీలు దుర్గారెడ్డి, సరిత, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షల నిర్వహణపై శిక్షణ

హుస్నాబాద్: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులకు పలు సూచనలు చేశారు. మాస్‌కాపియింగ్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు విధులు సక్రమంగా నిర్వహించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

గరుడోత్సవ వైభవం.. బ్రహ్మోత్సవ శోభితం



గరుడాళ్వారుకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నాచగిరిలో భక్తిపారవశ్యం

వర్గల్(గజ్వేల్): నాచగిరి బ్రహ్మోత్సవ సిరితో అలరారుతుంది. శుక్రవారం రాత్రి ఉత్సవాల్లో ప్రధానమైన శ్రీలక్ష్మీనృసింహుని గరుడోత్సవసేవ భక్తజనావళికి నేత్రపర్వం చేసింది. ఆలయ సహాయ కమిషనర్ కట్టా సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్ తదితర పురప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొని పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు మొదట విష్ణుమూర్తి ప్రతినిధి, వేద స్వరూపుడైన గరుత్మంతుడిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలికలతో కమనీయంగా అలంకరించి విశేషపూజలు చేశారు. నవదంపతులైన శ్రీలక్ష్మీ నారసింహులకు దంపతి సేవ, సదస్యం నిర్వహించి గరుడాళ్వారుకు గరుడ బలి నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారు గరుడ వాహనాసీనులై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నేత్రపర్వంగా సాగిన గరుడోత్సవ సేవలో భక్తులు పాల్గొని తరించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రఘురాం



మాట్లాడుతున్న జడ్జి రఘురాం

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరికీ చట్టాల గూర్చి అవగాహన తప్పనిసరి, వాటి దృష్టిలో ఉంచుకొని హక్కుల సాధనకు పోరాడాలని జిల్లా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ టి.రఘురాం సూచించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని విపంచి ఆడిటోరియంలో భరోసా, స్నేహిత సహకారంతో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మహిళలకు, బాలలకు హక్కుల గూర్చి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి రఘురాం మాట్లాడుతూ చట్టం గుర్తించిన హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల హక్కులను పొందలేకపోతారన్నారు. హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయసేవ సంస్థకు ఫిర్యాదు చేయాలని సూచించారు. లోక్ అదాలత్ వల్ల కోర్టులకు వచ్చే కేసుల సంఖ్య తగ్గుతుందన్నారు. చట్టాలపై ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే మహిళలు, బాలలపై లైంగిక, గృహహింస దాడులు తగ్గుతాయన్నారు. అంతకుముందు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పి. స్వాతి మాట్లాడుతూ అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా జిల్లా న్యాయసేవధికార సంస్థలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, అదనపు డీసీపీ మహేందర్,జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ ఫణీంద్ర, స్వర్డ్ సంస్థ డైరెక్టర్ శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

సిద్దిపేటఅర్బన్: వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా డ్రైవింగ్ చేస్తూ గమ్యస్థానాలకు చేరుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేటఅర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారణం లేని మరణం ఒక్క రోడ్డు ప్రమాదంలోనే సంభవిస్తుందన్నారు. వేగంగా వెళ్లే వాహనానికి, సాధారణ స్పీడ్‌తో వెళ్లే వాహనానికి కేవలం 15 నిమిషాలు మాత్రమే తేడా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే సమయంలో సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనదారులు, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దన్నారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా పార్కింగ్ కోసం నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వాహనాలు పార్క్ చేయాలని సూచించారు. జరిమానాలు వేయడం తమ అభిమతం కాదని నిబంధనలు ఉల్లంఘించిన వారికి మాత్రమే జరిమానాలు విధిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ ఎస్సై గోపాల్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పామాయిల్‌కే ప్రాధాన్యం

- కూరగాయలు, పండ్ల సాగుకు అంతంతే
- అందని సూక్ష్మసేద్య పరికరాలు
- పేరుకుపోయిన దరఖాస్తులు.. తప్పని నిరీక్షణ
- ‘వెజిటబుల్ హబ్’ గా ఆవిర్భవించిన జిల్లాలో పరిస్థితి



గజ్వేల్‌లో డ్రిప్ ద్వారా కూరగాయల సాగు

గజ్వేల్: జిల్లాలో ‘సూక్ష్మనీటి సేద్యపు పథకం’ అమలు తీరు నిరాశను కలిగిస్తుంది. ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు పరికరాల పంపిణీ అరకొరగా సాగుతుంది. ఫలితంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. విస్తారమైన సాగుతో ‘వెజిటబుల్ హబ్’గా ఆవిర్భవించిన జిల్లాలో కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొన్నేళ్లుగా సూక్ష్మనీటి సేద్యపు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ స్కీం ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తుండగా.. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సాధారణ రైతులకు 90శాతం, ఆపైన భూమి ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీపై సూక్ష్మనీటి పథకం కింద బిందు(డ్రిప్), తుంపర(స్ప్రింకర్ల)పరికరాలు అందిస్తున్నారు. కానీ సరిపడనంతగా బడ్జెట్ కేటాయించకపోవడంతో ఏళ్లుగా ఆయా దరఖాస్తులకు మోక్షం లేకుండా పోయింది.

అరకొర కేటాయింపులతోనే..

2022–23 ఏడాదికి సంబంధించి ప్రభుత్వం 8 వేల ఎకరాల్లో డ్రిప్, 500 ఎకరాల్లో స్ప్రింకర్లను విస్తరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందు కోసం ప్రభుత్వం సుమారుగా రూ.13 కోట్లకుపైనే నిధులు మంజూరు చేసింది. అయిల్‌పామ్ సాగు చేసే రైతులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. దీని తర్వాత రెండో ప్రాధాన్యతగా పండ్లు, మూడో ప్రాధాన్యతగా కూరగాయల సాగుకు అందించాలని భావించారు. ఇందులో భాగంగానే ఆయిల్‌పామ్‌కు సంబంధించి 5,600 ఎకరాల్లో విస్తరించడానికి యూనిట్లు మంజూరు కాగా, ఇప్పటికే 4,700 ఎకరా ల్లో పరికరాలు బిగించారు. కాగా కూరగాయల తోటలకు నామమాత్రంగానే పరికరాలను పంపిణీ చేశారు. స్ప్రింకర్ల విషయానికొస్తే మామిడి తోటలకు సంబంధించి 500 ఎకరాల్లో పరికరాలను బిగించారు. కూరగాయల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది.

దరఖాస్తులు పెండింగ్

జిల్లాలో ప్రస్తుతం కూరగాయ తోటలకు డ్రిప్పు పరికరాల కోసం రైతులక ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా నాలుగు వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023–24లోనైనా బడ్జెట్ మరింతగా పెరిగి పరికరాలు అందేనా? అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఆయిల్‌పామ్‌తోపాటు పండ్లు, కూరగాయలు తదితరాలకు మరింత ప్రోత్సాహం పెంచాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించిన విషయం తెలిసిందే. కానీ ఆశించిన విధంగా లేదు. ఈసారైనా పరిస్థితిలో మార్పు వస్తుందోనేమోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

దశలవారీగా పరిష్కారం..

జిల్లాలో దశలవారీగా బిందు, తుంపర సేద్యం పరికరాల దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వ సూచనల మేరకు ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. కూరగాయ తోటలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. కేటాయింపులు రాగానే వారికి కూడా పరికరాలు అందజేస్తాం.

– రామలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారిణి

ఫాంల్యాండ్ దందా

- అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- నాలా కన్వర్షన్ చేయకపోయినా పట్టించుకోని అధికారులు


ఎల్లాపూర్‌లో ఫాంల్యాండ్ వెంచర్ చుట్టూ కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

నర్సాపూర్: వ్యవసాయభూమిని...వ్యవసాయేతర భూమిగా మార్చలేదు. నిర్మాణాలకూ ఏ అనుమతి తీసుకోలేదు...కుంటను ధ్వంసం చేశారు. అయినా ఇవేవీ అధికారుల కళ్లకు కనిపించలేదు. మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో ఫాంల్యాండ్ పేరిట రియల్ దందాకు తెరలేపినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మాదాపూర్‌లో ఫాంల్యాండ్ వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇటీవల రోడ్లు ఏర్పాటు చేశారు. ఇది కూడా అధికారులకు కనిపించలేదు. నర్సాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఫాంల్యాండ్స్ దందా జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌కు అతిసమీపంలో ఉండడంతో రియల్‌వ్యాపారులు ఇక్కడ దృష్టి సారించారు.

- ఫాంల్యాండ్ పేరిట ఎల్లాపూర్‌లో 53ఎకరాల వ్యవసాయ భూమిని ఓ వెంచర్ నిర్వహకులు కొనుగోలు చేశారు.
- ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారు.
- కిలోమీటరు పొడవున ప్రహరీ నిర్మాణానికి పిల్లర్లు, బెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. గోడ నిర్మించేందుకు ఇటుక, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని సమకూర్చుకున్నారు. కొంత మేర గోడ సైతం నిర్మించారు.
- వ్యవసాయ భూమిలో ఏ నిర్మాణాలు చేపట్టాలన్న ముందుగా నాలా కింద ఆ భూమిని మార్పు చేయించాలి. కానీ సదరు నిర్వాహకులు అవేమీ పట్టించుకోలేదు.
- ఫాంల్యాండ్ పేరిట ఏర్పాటు చేస్తున్న వెంచర్ భూమిలో పెద్ద పెద్ద టేకు, తుమ్మ, ఇతర చెట్లు ఉన్నాయి. వాటిని నరికేందుకు కూడా ఏ అనుమతి తీసుకోలేదు.

ఎలాంటి ఫిర్యాదు రాలేదు

ఎల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాంల్యాండ్ వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఉందని ఎలాంటి ఫిర్యాదు అందలేదని తహసీల్దార్ ఆంజనేయులు చెప్పారు. ఫిర్యాదు వస్తే విచారణ చేసి ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే స్వాధీనం చేసుకుంటాం.

ప్రభుత్వ భూమిలోనూ....

ఫాంల్యాండ్ పేరిట ఏర్పాటు చేస్తున్న వెంచర్‌ను ఆనుకునే ప్రభుత్వభూమి కూడా ఉన్నట్టు తెలిసింది. చాలా ఏళ్లుగా ఆ భూమి వెంచరు యజమానులకు అమ్మిన వ్యక్తుల ఆ. దీనంలోనే ఉంది. అయితే ఈ భూమిని కూడా కలుపుకొని ప్రహరీ నిర్మించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రెండు మండలాల సరిహద్దు కుంట ధ్వంసం

ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్న ఎల్లాపూర్ నర్సాపూర్ మండల పరిధిలో ఉంటుంది. ఈ వెంచర్‌ను ఆనుకొని నాగటికుంట ఉంది. ఈ కుంట సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ పరిధిలోకి వస్తుంది. అయితే వెంచర్ భూమిని ఆనుకుని ఉన్న కుంటను ధ్వంసం చేసినా సాగునీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కుంటను ధ్వంసం చేసి వెంచరు భూమికి కుంటకు మధ్య నుంచి కొత్తగా కట్ట నిర్మించే పనులు చేపట్టారు.

నోటీసులు ఇచ్చి నిర్మాణ పనులు నిలిపివేయిస్తాం

ఎల్లాపూర్‌లో ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసింది. చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దని మౌఖికంగా చెప్పాం.త్వరలోనే వెంచర్ భూమిని పరిశీలించి లిఖితపూర్వకంగా నోటీసులు అందచేస్తాం.

–శ్రీనివాస్, ఎంపీఓ

క్లుప్తంగా

పర్సు అందజేత


శ్రీనివాస్‌కు పర్సు అందజేస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరుటౌన్: రోడ్డుపై పర్సు పోగొట్టుకున్న వ్యక్తిని అందులో ఆధారాల ద్వారా గుర్తించి అందజేశారు. పటాన్‌చెరు ఏఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన శ్రీనివాస్ గురువారం రాత్రి ఇస్నాపూర్ నుంచి పటాన్‌చెరు వైపు వస్తూ తన పర్సును పోగొట్టుకున్నాడు. నైట్‌డ్యూటీలో ఉన్న పోలీసులకు ఆ పర్సు దొరికింది. అందులో వివరాల ఆధారంగా బాధితుడు శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పర్సు తీసుకొని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరి మానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని పలు చోట్ల సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 15 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి వారికి రూ.32,500 జరిమానా విధించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెళ్ల గ్రామంలో గురువారం రాత్రి పిడుగు పడి ఓ పాడిగేదె మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన జాగిరి శ్రీనివాస్ ఎప్పటిలాగే పొలం వద్ద తన గేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి గేదె మృతి చెంది కనిపించింది. పిడుగుపాటు కారణంగా గేదె మృతి చెందడంతో రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గాజుల రమేష్ బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

కంది(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఓ తాపీమేస్త్రి మృతి చెందాడు. ఇంద్రకరణ్ ఎస్‌ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా సాతపూర్ గ్రామానికి చెందిన మల్లేశం (30)సంగారెడ్డిలో నివసిస్తూ తాపీమేస్త్రిగా పని చేస్తున్నాడు. గురువారం చేర్యాల్ శివారులో ఓ ఇల్లు నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మల్లేశంకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శుక్రవారం మృతుని భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెట్రోల్ బంక్ సీజ్

షార్ట్ డెలివరీని సరిచేయాలన్న అధికారులు

హుస్నాబాద్ : పట్టణంలోని సాయిశివ పెట్రోల్ బంక్‌లో లీటర్ పరిమాణం తగ్గిస్తూ తక్కువ పెట్రోల్ పోస్తూ దోపిడీ చేస్తున్నారంటూ వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం డీఎస్‌ఓ హరీష్, లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. కరెంట్ సరఫరా నిలిచినప్పుడు లీటర్ పెట్రోల్‌కు... తక్కువ పరిణామంలో పెట్రోల్ పోస్తున్నారని నిర్ధారించారు. షార్ట్ డెలివరీని పరిశీలించకపోవడంతో తక్కువ పరిణామంలో పెట్రోల్ వస్తుందన్నారు. కేసు నమోదు చేసి బంక్‌ను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. షార్ట్ డెలివరీని పూర్తిస్థాయిలో సరిచేసిన తర్వాతనే పెట్రోల్‌బంక్ రన్ చేయాలని సూచించారు. పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లు, టైర్లల్లో గాలినింపుకునేందుకు ఏర్పాట్లు చేయని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే కలెక్టర్ అధ్యక్షతన డీలర్లతో సమావేశం నిర్వహించి బంకుల్లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీపీ తనయుడిపై కేసు నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అమీన్‌పూర్ ఎంపీపీ తనయుడిపై కేసు నమోదైంది. బాధితురాలు రామచంద్రాపురం పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం .. రామచంద్రాపురం పట్టణానికి చెందిన ఓ యువతి పటాన్‌చెరు మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఆ కాలేజీలో చదువుకునే సమయంలో అధికార పార్టీకి చెందిన అమీన్‌పూర్ ఎంపీపీ రెండో కుమారుడు ఈర్ల ప్రశాంత్‌తో స్నేహం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఆరేళ్లుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఈర్ల ప్రశాంత్ ఆ యువతిని దూరం చేసే ప్రయత్నం చేయడం మొదలుపెట్టాడు. అంతేకాకుండా ఈనెల 17వ తేదీన మరో అమ్మాయితో నిశ్చితార్థానికి రెడీ అయిన విషయం తెలిసింది. దీంతో ఆ యువతి గురువారం ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రశాంత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ప్రశాంత్‌పై అత్యాచారం, చీటింగ్‌తో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

పట్టపగలు.. అందరూ చూస్తుండగానే

- మహిళ మెడలో బంగారు ఆభరణాల చోరీ
- గాయపడిన బాధితురాలు


బాధితురాలు రాజమణి

రామాయంపేట(మెదక్): అందరూ చూస్తుండగానే పట్టపగలు దొంగలు బరి తెగించారు. ఓ మహిళ మెడలో బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సుతారిపల్లి గ్రామానికి చెందిన రాగి రాజమణి, తన భర్త బాలయ్యతో కలిసి బ్యాంక్‌కు వచ్చింది. బాలయ్య బ్యాంకు లోపలకు వెళ్లగా, రాజమణి బయట నిలబడింది. నంబరుప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె పక్కనే ఆగారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి ముందు, వెనుకా పరిసరాలను పరిశీలించి, ఒక్కసారిగా రాజమణి మెడలో బంగారు పుస్తెలతాడు లాగాడు. దీంతో ఊహించని సంఘటనతో రాజమణి కిందపడిపోగా, క్షణాల్లోనే వారు సిద్దిపేట రోడ్డువైపు పారిపోయారు. కిందపడ్డ రాజమణి ముక్కుకు గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నించారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సీసీ పుటేజీలో బైక్‌పై వచ్చిన దొంగలు

యువతి అదృశ్యం


నర్మద(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధి చెండిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నర్మద గురువారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించిన సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తెల్లవారుజామున గమనించిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం యువతి తండ్రి భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

భూతగాదాలతో దాడి

కొమురవెల్లి(సిద్దిపేట): భూ తగాదాల నేపథ్యంలో ఓ మహిళ గాయపడింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని మర్రిముచ్చాలకు చెందిన శిఖ సత్తయ్య, తురాయి భూమయ్యలకు కొండపాక మండలం వెలికట్ట శివారులో ఓ భూమి విషయంలో వివాదం ఉంది. ఇటీవల ప్రభుత్వ సర్వేయర్ సర్వేచేసి భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే ప్రకారం భూమయ్య భూమిలో నుంచి సత్తయ్యకు కొంత భూమి వెలుతుంది. ఆ కోపంతో శుక్రవారం భూమయ్య కుటుంబసభ్యులు సత్తయ్య–వజ్రమ్మ దంపతులపై దాడి చేశారు. ఈ ఘటనలో వజ్రమ్మ కుడిచేయి విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. 108లో ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో...


గుగులోతు రాజు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం..మండలపరిధిలోని చాపగానితండాకు చెందిన గుగులోతు రాజునాయక్(32) వివాహం చెర్వుముందుతండాకు చెందిన భానోతు లావణ్యతో నాలుగు సంవత్సరాల క్రితం జరిగింది. కరీంనగర్‌లోని శాంతినగర్‌లో నివాసముంటూ అక్కడే ఉంటూ పనులు చేసుకుంటున్నారు. తరచు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో పెద్దమనుషుల సమక్షంలో మూడు సార్లు పంచాయితీ జరిగింది. పదిరోజుల కింద భార్య విడాకుల నోటీస్ పంపింది. రెండు రోజుల కిందట భార్యను తీసుకొచ్చేందుకు రాజునాయక్ శాంతినగర్‌కు వెళ్లాడు. అక్కడే ఉన్న అత్త విజయ, మామ రాజు, బావమరిది నవీన్‌లు రాజునాయక్‌ను తిట్టి కొట్టి అవమానించి వెళ్లగొట్టారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గుగులోతు కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



సిద్దిపేటఅర్బన్: విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. మండల పరిధిలోని మందపల్లి గ్రామానికి చెందిన కొత్త బుచ్చిరాంరెడ్డి శుక్రవారం ఉదయం ఇంటి వద్ద ఉన్న గేదెను పొలానికి తీసుకెళుతుండగా, గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకింది. దీంతో గేదెకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.80 వేల విలువైన పాడిగేదె మృతి చెందడంతో రైతు ఆవేదనకు లోనయ్యారు. పాడి గేదెను కోల్పోయిన రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సర్పంచ్ కొమ్ము రాజయ్య కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


అపస్మారక స్థితిలో మహిళ


మల్లేశం మృతదేహం

వర్గల్(గజ్వేల్): బైక్‌ను బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా బోనాల కొండాపూర్‌కు చెందిన పాటేలు మల్లేశం(30) శుక్రవారం మహిళతో బైక్‌పై తూప్రాన్ నుంచి నాచారం బయలుదేరాడు. నాచారం పెట్రోల్ బంకు వద్దకు రాగానే బైక్‌ను తూప్రాన్ వైపు వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ మీద కూర్చున్న అపరిచిత మహిళ తీవ్రగాయాలతో అపస్మారక స్థితికి చేరింది. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



నిజాంపేట(మెదక్): షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన కనకరాజు ఉపాధి కోసం సౌదీకి వలసవెళ్లాడు. భార్య జ్యోతి పనులు చేసుకుంటూ బీడీలు చుట్టేది. గురువారం రాత్రి పదకొండు దాటాక షార్ట్ సర్క్యూట్ ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో సామగ్రి దగ్ధమైంది. ఆస్తినష్టం విలువ రూ.40 వేల వరకు ఉంటుందని ఆర్‌ఐ యూసుఫ్ తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని జ్యోతి వేడుకుంటోంది.

రెండు తలల పాముల విక్రయ ముఠా అరెస్ట్


పోలీసుల అదుపులో ఉన్న రెండు తలలపాముల విక్రయ ముఠా ఇదే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రెండు తలల పాములను విక్రయిస్తున్న ఓ ముఠాను రామచంద్రాపురం, ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పాములు, రూ.1,90,000, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మియాపూర్ ఏసీపీ నరసింహారావు, సంగారెడ్డి డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావులు విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన మాణిక్‌రెడ్డి రామచంద్రాపురంలోని జ్యోతినగర్‌లో నివాసముంటున్నాడు. మాణిక్‌రెడ్డి అద్దెకు కార్లు తిప్పుతుండగా, ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రశేఖర్‌తో స్నేహం ఏర్పడింది. మాణిక్‌రెడ్డి రెండుతలల పామును గురించి తెలుసుకొని వాటిని విక్రయిస్తే పెద్దఎత్తున డబ్బు వస్తుందని భావించాడు. ఆ క్రమంలో చంద్రశేఖర్‌తో రెండు తలల పాము గురించి మాట్లాడాడు. రెండు తలల పాములు తీసుకొస్తే డబ్బులు ఇస్తానని చెప్పి రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. చంద్రశేఖర్, నవీన్, భాస్కర్‌లు నల్లమల అటవీ ప్రాంతం నుంచి రెండు తలల పాములు రెండింటికి తీసుకొని మాణిక్‌రెడ్డి ఇంటికి ఈనెల 15వ తేదీన వచ్చారు. వీటిని విక్రయించేందుకు మాణిక్‌రెడ్డి కర్ణాటకకు చెందిన ఓ ముఠాతో సంప్రదింపులు చేశాడు. గురువారం చంద్రశేఖర్‌కు డబ్బు ఇస్తానని చెప్పి మాణిక్‌రెడ్డి ఇంటికి పిలిచాడు. అదే సమయంలో పాములను కొనుగోలు చేసేందుకు కర్ణాటక నుంచి పలువురు వచ్చారు. కచ్చితమైన సమాచారం రావడంతో రామచంద్రాపురం పోలీసులు, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు మాణిక్ రెడ్డి ఇంటిపై దాడి చేశారు. మాణిక్‌రెడ్డితో పాటు చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రశేఖర్, నవీన్, భాస్కర్, కర్ణాటకకు చెందిన ఎండీభాష, రాఘవేందర్, రమేష్, షేక్ సికిందర్, విజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. రెండు పాములను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ కేసుతో సంబంధమున్న మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ సమావేశంలో సీఐ సంజయ్‌కుమార్, ఎస్‌ఓటి సీఐ శివశంకర్, అటవీశాఖ రేంజర్ వీరేంద్రబాబు, ఎస్‌ఐ శశికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతోనే పాములకు ముప్పు

మూఢనమ్మకాలతో రెండు తలకాయల పాము జాతి అంతరించిపోతుందని డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావు తెలిపారు. రెండు తలల పామును ఇంట్లో పెట్టుకుంటే తక్కువ సమయంలో ధనవంతులు అవుతారన్న మూఢనమ్మకం అనేకమందికి ఉందన్నారు. గుప్త నిధులను గుర్తించడంలో రెండు తలల పాము ఉపయోగపడుతుందన్న మూఢనమ్మకంతో వీటి క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఇది సరైనది కాదని, వీటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

సైబర్‌నేరాలపై 1930కి కాల్ చేయండి

సిద్దిపేట సీపీ శ్వేత

దుబ్బాకటౌన్: ఏదైనా సైబర్‌క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్‌చేస్తే పోగొట్టుకున్న డబ్బు తిరిగి పొందేలా చేయవచ్చు అని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం సైబర్ నేరాలపై సీపీ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

- దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరధిలోని బాధితుడు రైల్వే పరీక్ష కోసం చెన్నై వెళ్లగా, రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి తెలుగులో మాట్లాడి పరిచయం చేసుకున్నాడు. మెడికల్ టెస్టులు తక్కువ డిస్కౌంట్‌లో చేయిస్తానని చెప్పి అతని అకౌంట్ నుంచి రూ.10 వేలు పంపించుకున్నాడు. తర్వాత బాధితుడు డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లగా, డబ్బు మాకు రాలేదని, ఆ వ్యక్తి ఎవరో తెలియదని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ఇదే పోలీస్‌స్టేషన్ పరధిలోనే ఒకరికి ఓ అపరిచితుడు ఫోన్ చేసి మీ క్రెడిట్ కార్డు బ్లాక్ అయ్యిందని, వెంటనే దానిని అన్‌బ్లాక్ చేయాలని నమ్మించాడు. అలా రూ.14,111 అకౌంట్ నుంచి లాగేస్తుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏసీబీ అధికారులమంటూ ఎంపీఓకు కాల్

- డబ్బు పంపాలని డిమాండ్
- ఒకే రోజు నలుగురు ప్రభుత్వ అధికారులకు ఫోన్లు

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎంపీఓతో పాటు, మరో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులకు ఏసీబీ అధికారులమంటూ శుక్రవారం ఫోన్ చేశారు. డబ్బులు పంపాలని డిమాండ్ చేశారని, గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు ఎవరూ స్పందించకూడదని సిద్దిపేట సీపీ శ్వేత సూచించారు.

- ఓ ఎంపీఓ అధికారికి 08459989750 నంబరు నుంచి ఏసీబీ అధికారులమంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీరు అక్రమఆస్తులు కలిగి ఉన్నారని ఫిర్యాదులు వచ్చాయని, విచారణ జరిపి మీపై వచ్చిన ఆరోపణలు చిన్నవే అని ధ్రువీకరించడానికి రూ.1,50,000 పంపించాలని డిమాండ్ చేశాడు. అయితే ఆ ఉద్యోగి తనకు ఏ అక్రమ ఆస్తులు లేవని చెప్పాడు. పది నిమిషాల తర్వాత సైబర్ కేటుగాడు మళ్లీ ఫోన్ చేసి రూ.50వేలు పంపిస్తే మెయిల్‌కు క్లియరెన్స్ సర్టిఫికెట్ పంపిస్తామని నమ్మించాడు. అంత మొత్తం డబ్బు లేవని ఆ అధికారి చెప్పగా, మొదటగా రూ.10వేలు పంపి తర్వాత మిగతా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలని సూచించాడు. దీంతో అనుమానం వచ్చిన ఆ ఎంపీఓ సైబర్ నేరం జరిగే అవకాశం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ఇదే విధంగా వేర్వేరు నంబర్లనుంచి జిల్లాలోని మిగతా ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులకు ఏసీబీ అధికారులమని, డబ్బు డిమాండ్ చేస్తూ కాల్స్ చేశారు. దీంతో వారు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కన్నతల్లితో అసభ్యంగా ప్రవర్తించిన కొడుకుకు రెండేళ్ల జైలు

సిద్దిపేటకమాన్: మద్యానికి బానిసై కన్నతల్లిని బూతులు తిడుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ ఆమెను వివస్త్రను చేసిన కేసులో కొడుకుకు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ సిద్దిపేట న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని హరీశ్‌రావునగర్‌కు చెందిన కళావతి 2020 జనవరి 10వ తేదీన తన కుమారుడు యాదగిరి తనను వేధిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు యాదగిరి మద్యానికి బానిసై వేధిస్తుండడంతో తట్టుకోలేక భార్య పిల్లలను తీసుకొని తన పుట్టింటికి వెళ్లింది. యాదగిరి మద్యం మత్తులో తరచు తన తల్లిని బూతు మాటలు తిడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. దీంతో ఆమె కొన్ని రోజులు కూతుళ్ల దగ్గరికి వెళ్లింది. దీంతో యాదగిరి కాలనీలోని అందరి ఇళ్ల తలుపులు కొట్టుకుంటూ ఇబ్బంది పెట్టేవాడు. ఇది తెలుసుకొని కళావతి ఇంటికి రాగా మళ్లీ బూతు మాటలు తిడుతూ తనను వివస్త్రను చేశాడని, అరిస్తే చంపేస్తానని కత్తితో బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ సైదులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇరుపక్షాల వాదనల తర్వాత న్యాయమూర్తి సల్మా ఫాతిమా నేరస్తునికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించించారు.